# ఆంధ్రాభివృద్ధికి

ప్రత్యేకరాష్ట్రానికోసం బహుకాలంగా ప్రయత్నించాం. ఎలాగైతేనేం సాధించాం. ఐనా సంతృప్తిలేదే!

"ఉన్నదే తిను, లేనట్టి దానికొరకు

పోరుబెట్టకు ముద్దుకుమార! నీవు" — అని చిన్ననాడే నేర్చుకొన్న చిరస్మరణీయమైన నీతికి కాస్తా చెల్లుచీటీకొట్టేశాం. 'పెద్దతనమువచ్చి బుద్ధి పెడతలపట్టెన్' అని తెలివిలేని తెలుగువాళ్లకి యిదో తెగులుపట్టుకొంది. ప్రతివాడినోటా

"ఫలితానికిరాలేదు" అనే అసంతృప్తేనాయె.

అసలు మనకు రాష్ట్రం దేనికో? మొదట తేల్చేసుకొంటే — వాటినిబట్టే అదిఫలితానికి వచ్చిందీరానిదీ యిట్టే తేలిపోతుంది —

అసలు మనకు రాష్ట్రం దేనికి?

యీ ప్రశ్నకు సమాధానం చెప్పగల ఇంగిత జ్ఞానులు యింతవరకూ కనిపించడంలేదు.

"అరవల దోపిడిని తొలగించడానికి" అంటారు ఒకరు.

కమ్మని సాంబారు, కాఫీ కడుపులోపోసి డబ్బులుపుచ్చుకోడం దోపిడేనా?

"ఉద్యోగాలన్నీ ఆంధ్రులకు దక్కకుండా యితరులకుపోతున్నాయి" అంటారు మరొకరు.

అసలు ఉద్యోగమంటేనే సేవావృత్తి అన్న విషయాన్ని మరచిపోయినవాళ్ళకు పట్టుకొన్నజాడ్యం యిది. సామ్రాజ్యాలకు సామ్రాజ్యాలు ఏలుబడికావించిన ఆంధ్రజాతికిపట్టిన అవలక్షణం యిది. ఉద్యోగాలపేరుతో ఆఫీసుల్లో ప్రొద్దస్తమానం పడివుండడం ఎలాంటి నికృష్టమో తెలియని తెలివితక్కువతనం. నిరుద్యోగులుగా బజార్ల వెంట ఊరేగుతుంటే ఆంధ్రపట్ణాలు ప్రజలతో కిక్కిరిసి పచ్చపచ్చగా ఎలా వెలిగివిలసిల్లుతాయో ఊహించలేని ఆంధ్రుల అంధత్వం యిది.

అసలీ వుద్యోగాల వూసే బానిసలక్షణం. ఆంధ్రజాతికి తీరని అవమానం.

పోతే - "మన పారిశ్రామికాభివృద్ధికోసం-" అంటారు యింకొకరు.

మనకు పరిశ్రమలులేనిదెక్కడా? ఉన్నవేవో వున్నాయి. లేనివి లేనేలేవు. ఏమయితేనేం? మనకు కావలసింది సామాగ్రి. ఎక్కడనుంచివస్తే మనకేం గనుకా-?

వాటెని సింధియా, దాల్మియా, తాతా, బిర్లా, ఎవరో ఒక విసన్న మనం అడిగీ అడక్కముందే మన

అవసరాల్ని గుర్తించి అందిస్తున్నాడా? లేదా? అన్నది ప్రధానం. కాని ఆంధ్రుడే అయితే మనకి ఒరిగి ఒడిలో పడేదేమిటి? హాయిగా కాలుమీద కాలువేసుకుని నోట్లో వేలేసుకుని కూర్చోక.

అవసరమని తోస్తే 'ది ఆంధ్రా గోంగూర కంపెనీ లిమిటెడ్' కూడా ఏ 'బిర్లా' నో ఏర్పాటు చేస్తాడు. సుప్రసిద్ధమైన కాకర్ల మూడీ గోంగూర సప్లై చేస్తాడు. సలక్షణంగాతింటూ కూర్చోక - యింకా పరిశ్రమలూ ప్రాజెక్టులూ అనడం అర్థంలేని విషయం.

ఏతావాతాతరచిచూడగా తేల్తున్నదల్లాఒక్కటే-

'ప్రముఖనాయకులకందరికీ చాలినన్ని పదవులు కావాలంటే ప్రత్యేకరాష్ట్రం ప్రధానం' అని —

ఆంధ్రజాతీయనాయకుల్లో అధికభాగం యిప్పటికీ పదవులకోసం అల్లాడిపోతూ బజార్లవెంట తిరుగుతున్నారంటేనూ; పరాయివాళ్ళ పదవులుచూచి పళ్లు పులిసి 'నక్క - ద్రాక్షపండ్లు' నాటకాలు ఆడుతున్నారంటేనూ; విసిగివేసారి వేరువేరు పొయ్యిలుపెట్టుకున్నారంటేనూ విచారపడతగ్గవిషయం. 'ఆ కొరతతీర్చడానికే ఆంధ్రరాష్ట్రం' అంటే — అంగీకరించాల్సిన విషయం.

యిందుకే ఆంధ్రరాష్ట్రం అని తేలిపోయింది గనుక-వచ్చినరాష్ట్రంలో ఇది ఫలితానికివచ్చిందా? లేదా?

అందరికీకాకపోయినా కొందరికైనా పదవులు

దొరికినట్లు నిదర్శనాలున్నాయి. కనుక ఫలితం 'ఏమీ' కన్పించడంలేదనేదిఅసత్యం. పోగా-మనకింకా ఏపదవులూ లేక వుసూరుమంటోన్న మిగతావాళ్లూ కనబడుతూనే వున్నారు. గనుక 'ఫలితం పరిపూర్ణంకాలేదు' అనేది సత్యం.

ఐతే అది ఎలా వస్తుంది? అన్నదే యిప్పుడు మన ముందుండుకోన్న చిక్కు సమస్య.

'ఆరంభింపరు మూఢమానవులు' అన్నాడు ఓ కవి. మనం మూఢమానవులంకాము కనుకనే ఆరంభించేశాం. అయితే 'ఆంధ్రులది ఆరంభశూరత్వం' అన్న బిరుదంకూడావుంది మనకి. మనం దాన్నిపోగొట్టి చరిత్రని మరోవిధంగా వ్రాస్తేనే — 'ఆంధ్రులం అసహాయ శూరులం' అన్న ఖ్యాతివస్తుంది. ఈ 'అసహాయ' అన్నది మనకేం కొత్తగాదు. గతంలో కాంగ్రెస్ 'అసహాయ' ఉద్యమంలో అమోఘంగా పనిచేశాం. అందుకనే మన కాంగ్రెస్‌నాయకులు సర్వేసర్వత్రా అసహాయంగా ఎవరికి వారే పోతూంటారు...

కాబట్టి మనంకూడా వారిలాగే ఆ పరిపూర్ణత్వానికి ప్లానులు పూర్తిచేయాలి.

ఈ యుగాన్ని ఎవరు ఏమన్నా, ఇదిమాత్రం నిజానికి సంఘాలయుగం. అంచేతనే యిప్పటికే — 'విశాలాంధ్ర రైలుప్రయాణీకులసంఘం' 'సినిమా ప్రేక్షక సంఘం' యిలాంటివి అనేకం వెలుస్తున్నాయి. వీటివల్ల

పెద్దబాధలేదు. ప్రపంచంలోని ప్రతివాడూ ఎప్పుడో ఒకప్పుడు రైలు ఎక్కకపోడు. ఎప్పుడో ఒకప్పుడు సినిమా చూడకపోడు. అంచేత వీటినిర్మాణానికేమీ అవస్థలేదు. అయినవాళ్ళ నలుగురిమధ్యా కూచోని ఓ పేరుపెట్టేసు కుంటేచాలు. కార్యవర్గంఅంటూ తలాఒకపదవీ పంచుకుంటేచాలు. మిగతా ప్రపంచమంతా సభ్యులూ, వీరు నాయకులూ అయిపోతారు. పూనుకొని పుష్కరానికో స్టేట్‌మెంటు యివ్వు. తోచినప్పుడు సాంవత్సరికం పెట్టు. పెట్టలేవూ? అదీ అక్కర్లేదు. చెయ్యలేదని అడిగే వాడుండడు. చేస్తే ఏడ్చేవాడుండడు.

కనుకనే — యిలా సూక్ష్మంలోమోక్షంగా మనప్లానును పూర్తిచెయ్యాలి.

అందుకుగాను — రాష్ట్రాభివృద్ధికై రభస పడేవారంతా యీక్రింది కార్యక్రమానికి తక్షణం పూనుకోవాలి.

1. ఎ. 'పొగత్రాగువారిసంఘం' 'పొగత్రాగుడు నివారణాసంఘం' 'పత్రికాశ్రోతలసంఘం' 'పత్రికాచూపరుల సంఘం' యిలాంటి వెన్నైనా స్థాపించేందుకు నడుంకట్టాలి.

బి. ఇవి ఆంధ్రరాష్ట్ర సంఘాలూ, విశాలాంధ్ర సంఘాలూ, అఖిలభారత, ఆసియా, అంతర్జాతీయ సంఘాలదాకా నిర్మించాలి.

సి. వీటన్నిటికీ అధ్యక్షు, కార్యదర్శులూ, కోశాధిపతులేగాక కావలసినన్ని 'ఉప' లు కూడా ఏర్పాటుచెయ్యాలి.

డి. యింతేగాక — ప్రతిసంఘమూ కార్యాచరణ, ఆచారణశూన్య; లైజాన్సు, రినైజాన్సు కమిటీలు విచారణసంఘాలూ కాలపరిమితిలేకుండా వేస్తుండాలి.

ఇ. ప్రభుత్వానికూడా ప్రతికార్యక్రమానికీ అధికార అనధికారమిటీలనూ, ఉపసంఘాలనూ నిర్మించడమే పరమావధిగావుండాలి.

యఫ్. దినపత్రికలన్నీ వీటికి విపరీతమైన ప్రచారం యివ్వడంలో యిప్పటిపద్ధతినే కొనసాగించాలి.

2. మనం యింత విస్తృతమైనప్లానులు యిలా వేసుకున్నప్పటికీ ఒకేదానికే అనేకమంది పోటీలుపడే ప్రమాదంవుంది. కనుక అతిజాగ్రత్తగా ఐక్యతను సాధించాలి. యిప్పటివరకూ మనం సాగిస్తున్న కృషిలో — ఐక్యతకోసం రెండుపార్టీలూ ఏకమై మూడు, నాలుగుగ చీలడం, సత్యాసత్యంగా ద్యోతకమౌతోంది. కనుకయిప్పుడు మనం పోయేమార్గం ఐక్యతకు దారితీయదన్నమాట.

చచ్చి ఏ స్వర్గానవున్నాడో సర్దార్ పటేలు మహాశయుడు వెనుకటికోసారి అన్నాడు.

"మొదట మీ తలలన్నీకూడాలి" అని — ఆ కాస్తాజరగాలేగాని నిజంగామనం సాధించలేనిదేలేదు.

మరి మన తలలు ఎలా కూడుతాయి?

జుట్లూజుట్లూ ముడెట్టుకోడంకన్నా మరి దారి లేదు. అందుక్కూడా వీలులేకుండా బ్రిటీష్‌వాళ్ల పుణ్యమా అంటూ మన తలలన్నీ క్రాపింగులుఅయి జుట్టేలేకుండా పోయింది. కనుక —

క. ఈ రోజునుంచే జుట్లూజుట్లూ ముడిబెట్టుకోడానికి వీలుగా జుట్టుపెంచేందుకు పంచవర్ష ప్రణాళిక నొకదాన్ని ప్రకటించాలి, ప్రారంభించాలి.

చ. యీ అయిదేళ్ళలోనూ పెరిగే జుట్లకు పన్ను పడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనుంచి గట్టి హామీకి ప్రయత్నం చేయాలి.

ట. మనం క్రాపింగులు తీసివెయ్యాలంటే కామన్వెల్తు ఆమోదంవుండటం అత్యవసరం గనుక — త్వరలో కామన్వెల్తుదేశాల సభజరిపించేందుకూ, అందులో యీ విషయాన్ని ప్రతిపాదించేందుకూగాను మన ప్రధాని నెహ్రూ దగ్గరకు ఒక రాయబారకమిటీనిపంపించాలి.

'ఆలస్యం అమృతం విషం' అన్న సూక్తిని జ్ఞాపకంవుంచుకుని అందినవాళ్లు అందినట్టు పదవులుపుచ్చుకోడమూ, అందనివాళ్లు జుట్లుపని పెట్టుకోడమూ తక్షణం సాగిస్తేనేగాని రాష్ట్రాభివృద్ధి సాధ్యంకాదు.